క్లుప్తంగా

ఇరుముడి చెల్లించిన వినాయకుడి భక్తులు


దీక్ష విరమిస్తున్న భక్తులు

కాణిపాకం: వినాయకుడి దీక్ష చేపట్టిన పలువురు భక్తులు గురువారం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఇరుముడులు చెల్లించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని సూర్య సత్యనారాయణ మూర్తి శర్మ ఆధ్వర్యంలో 60 మంది భక్తులు దీక్ష చేపట్టి కాణిపాకం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఇరుముడుల మండపం వద్ద ఇరుముడులు చెల్లించేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామి వారి దర్శనం కల్పించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె : సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. ఆయన గురువారం తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జ్వరాలు ప్రబలిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నిర్మలమ్మ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు కాంప్లెక్సు వద్ద ప్రహరీ తొలగింపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరణలో భాగంగా కార్పొరేషన్ అధికారులు స్థానిక జిల్లా న్యాయస్థానాల సముదాయం వద్ద ఉన్న ప్రహరీగోడను గురువారం తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఈ పనులను పర్యవేక్షించారు. చిత్తూరు–తిరుపతి, చిత్తూరు–వేలూరు రోడ్డు విస్తరణ కోసం అధికారులు ఇప్పటికే పనులు ప్రారంభించారు. పలువురు భవన యజమానుల నుంచి అంగీకారం తీసుకుని భవనాలను తొలగిస్తున్నారు. జిల్లా కోర్టు వద్ద ఉన్న ప్రహరీను తొలగించిన అధికారులు, దాని స్థానంలో కొత్త ప్రహరీని నిర్మించి అప్పగించారు.

సంఘమిత్రలపై వేధింపులు మానుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఉన్న సంఘమిత్రలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు తెలిపారు. ఆయన గురువారం యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల కాలపరిమితి విధానాన్ని రద్దు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ప్రస్తావన లేదని దుయ్యబట్టారు. జెండర్ విధానాన్ని రద్దు చేసి, వేతనాలను సంఘమిత్రల ఖాతాలో జమ చేయాలన్నారు. త్వరలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు మహాసభలు నిర్వహించి నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటామన్నారు. తదుపరి భవిష్యత్ పోరాటాలను బలోపేతం చేయడానికి తీర్మానాలు చేస్తామన్నారు. సమావేశంలో సంఘమిత్రల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా నాయ కులు మమత అంజప్ప పాల్గొన్నారు.

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలుగా ఎం.విజయశాంతిని నియమించారు. ఈమేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం వివరాలను ప్రకటించింది. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వివరించారు.

19న క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పులిచెర్ల(కల్లూరు) : ఈ నెల 19న కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో అండర్–14, 17 క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలి పారు. వారు గురువారం ఎమ్మార్సీలో హెచ్‌ఎంలు, పీఈటీలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో మండల స్థాయిలో కల్లూరులో ఎంపిక చేపడుతున్నట్టు తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.







సాంస్కృతిక సంబరం

కాణిపాక వరసిద్ధి వినాయకుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక దేవస్థాన ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు గురువారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. అలాగే గీతాలాపాలన, హరికథా కాలక్షేపం , పౌరాణిక నాటకాలతో సభికులను మెప్పించారు.

– కాణిపాకం

ఆత్మస్థైర్యమే ఆయుధం


మాట్లాడుతున్న శ్యామలాదేవి

చిత్తూరు కలెక్టరేట్ : ఆత్మ స్థైర్యమే అమ్మాయిలకు ఆయుధం అని జేవీవీ సమతా విభాగం కన్వీనర్ శ్యామలాదేవి తెలిపారు. జేవీవీ సమతా విభాగం ఆధ్వర్యంలో సంజయ్‌గాంధీ నగర్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలో గురువారం ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సులో బాలికల్లో కలిగే మార్పులు సహజమైనవిగా భావించాలన్నారు. సిగ్గు, బిడియాన్ని ఎక్కువగా పెంచుకోవడం వల్ల బలహీనులుగా భావించకూడదని పేర్కొన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు అరుణశివప్రసాద్ మాట్లాడుతూ అమ్మాయిలు అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. ఏ సమస్య ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, జేవీవీ పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ 4.0 సర్వేపై శిక్షణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు ఎన్‌సీడీ 4.0 సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ గిరి సర్వే నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర లక్షణాలు, సర్వే నిర్వహణపై వివరించారు.

ప్రచారం తప్ప పాలన ఏదీ..?


చీరలు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి, హరిణిరెడ్డి

- వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి పాలనలో ప్రచారం తప్ప పాలన అందించడం లేదని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం కార్పొరేటర్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, మురళీ, నాథం సతీష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు కాలనీలో 5, 6, 7 డివిజన్లలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోటు, మోసం గుర్తుకు వస్తాయన్నారు. పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ఇక ప్రజలు ఎంత అని ఎద్దేవా చేశారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు.

చీరల పంపిణీ:
అనంతరం హరిణిరెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగుల, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి నాయకులు ప్రకాష్, ఆను, నారాయణ, భాగ్యలక్ష్మి, శేఖర్, అప్పాజీ, మనోజ్‌రెడ్డి, శివారెడ్డి, చాన్‌బాషా, రమేష్, అన్బు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం వైఎస్సార్ సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంతపేట కరుమారియమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 1,116 టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సంతపేట కూడలిలో 100 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో అపోలో ఆస్పత్రి వైద్యుల సహకారంతో 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జ్ఞానజగదీష్ మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం తమ నాయకుడిపై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపిందన్నారు. ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మాజీ చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి నాయకులు హరిణిరెడ్డి, మనోహర్‌రెడ్డి, శివారెడ్డి, బాబురెడ్డి, మనోజ్‌రెడ్డి, ఐ.శివారెడ్డి, గిరిరెడ్డి, చిట్టి, శ్రీనివాసన్, నారాయణ, అప్పాజీ, హమీద్, మధు రెడ్డి, చక్రీ, సెల్వ, పాండు, వినోద్, మహేష్, సద్దాం, రవి తదితరులు పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న విజయానందరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జ్ఞానజగదీష్


టెంకాయలు కొడుతున్న నాయకులు


స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

వరసిద్ధుడి సన్నిధిలో జార్ఖండ్ మాజీ సీఎం


స్వామి చిత్రపటం అందుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం రాత్రి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి సరయురాయ్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచనం, ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది చిట్టిబాబు ఉన్నారు.

మెలియోయిడోసిస్‌పై అవగాహన ఉండాలి

ఐరాల: ప్రాణాంతకమైన మెలియోయిడోసిస్ వ్యాధిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. ఆయన శుక్రవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి మెలియోయిడోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మెలియోయిడోసిస్ వ్యాధి నేల ద్వారా సంక్రమించే బ్యాక్టీరియా వల్ల వస్తుందన్నారు. ఇది గుంటూరు జిల్లా తురకపాలెంలో బయటపడినట్లు చెప్పారు. హెచ్ఐవీ, మధుమేహం, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, రైతులు, మట్టిలో పనిచేసే రోజు వారి కూలీలకు ఎక్కువగా సోకే అవకాశం ఉంటుందని తెలిపారు. నిమోనియా జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, అల్సర్, ఉదర అవయవం, చర్మం, రక్త ప్రవాహం ఇన్‌ఫెక్షన్ల వంటి లక్షణాలు వుంటాయని తెలిపారు. మొదటి దశలో యాంటీబయాటిక్స్ తాత్కాలిక డోస్‌తో పాటు రెండో దశలో దీర్ఘకాలిక యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తారని తెలిపారు. రెండో దశలో కూడా సరైన వైద్యం అందకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని సూచించారు. ఎవరిలోనైనా వ్యాధి లక్షణాలు వుంటే వెంటనే ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప

మండల అభివృద్ధికి సహకరించాలి

– ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి

తవణంపల్లె: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందించాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రెడ్డిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సకాలంలో అమలు చేయాలని సూచించారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. మండలంలో 15,800 స్మార్ట్ రేషన్ కార్డులను డీలర్ల ద్వారా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి సోలార్ విద్యుత్ సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు కమిటీలను నియమించినట్లు వెల్లడించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ స్కూల్ పిల్లలకు జ్వరాలు ప్రబలుతున్నాయని, ఉపాధ్యాయులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి ఏపీవో బాల మాట్లాడుతూ ఉపాధి కింద పండ్ల తోటలు పెంపకానికి రైతులు ముందుకు రావాలని తెలిపారు. ఎంపీటీసీ రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు నుంచి తవణంపల్లె, మత్యం మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ అనసూయమ్మ, ఎంఈవో హేమలత, ఏపీఎం రవి, ఏవో జి.ప్రవీణ్, వెటర్నరీ అధికారి డాక్టర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి

గుడిపాలలో యూరియా పంపిణీ

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం, పేయనపల్లె ఆర్ఎస్‌కేల్లో గురువారం వ్యవసాయాధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. గుడిపాలకు 300 బ్యాగులు యూరియా వచ్చినట్టు వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. బయోమెట్రిక్ ద్వారా యూరియాను అందజేస్తున్నట్టు వెల్లడించారు. గుడిపాల రైతుసేవా కేంద్రంలో 150 బ్యాగులు ఉన్నాయని, వాటిని కూడా సరఫరా చేస్తామన్నారు.


యూరియా కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతన్నలు

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్‌లో విలీనమైన శివారు ప్రాంతాల్లో వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం చిత్తూరు నగరంలోని 49, 50వ డివిజన్ల పరిధిలో ఉన్న శివారు ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్డు, కాలువలు, విద్యుత్ సౌకర్యం, అంబులెన్స్ సమస్యలున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామని, త్వరలోనే అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కోకావాండ్లవూరిలో పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, తహసీల్దార్ కులశేఖర్‌ను ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.లోకేష్ తదితరులు ఉన్నారు.


చిత్తూరు కోకావాండ్ల వూరిలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్



రోడ్డు కోతకు గురికావడంతో నడవలేకపోతున్న రెడ్డిగుంట ఎస్టీ కాలనీ వాసులు

ఇలా ఉంటే ఎలా వెళ్లాలి

గుడిపాల: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నేటికీ సరైన రహదారులు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. గుడిపాల మండలం పేయనపల్లె పంచాయతీ రెడ్డిగుంట ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో బురదమయం అవుతోందని పేర్కొంటున్నారు. కనీసం మట్టి అయినా వేసి రోడ్డును బాగు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గురువు చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు


సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు

పూతలపట్టు(యాదమరి): విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్ది బంగారు భవిష్యత్తు కల్పించే నవనిర్మాత గురువే అని ఎంపీడీవో నాగరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సకల విద్యలకు ఆది బిందువు గురువే అని, అలాంటి గురువులను పూజించడం గర్వకారణమన్నారు. చిన్నతనంలో గురువులు నేర్పిన క్రమశిక్షణతోనే ప్రతి ఉద్యోగీ ఈ స్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. ఒక ఉపాధ్యాయుడు పామరుడిని సైతం పండితుడు చెయ్యగలరని కొనియాడారు. అనంతరం ఎంఈవోలు వాసుదేవన్, మధుసూదన్‌రెడ్డితో కలిసి మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిలామణి, ప్రధానోపాధ్యాయులు ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.